కథ

# మృత్యువు కోసం...

**పి. శ్రీపతి**

మృత్యుచోటు కావాలని అతని ఆకాంక్ష. అందు
అందరి ఆలోచనలెలా ఉన్నా... ఈయన మాత్ర

## దట్టమైన అటవీ ప్రాంతం. మధ్యలో కాలువలా చీలి ఉన్న మట్టిరోడ్డుపై ఎర్రబస్సు మెల్లిగా సాగిపోతోంది.

బస్సుకి అద్దాలు లేక చల్లగాలి రివ్వున దూసుకొస్తోంది.



ఒంటిపై నిక్కబొడుచుకున్న వెంట్రుకల్ని నిశ్చలంగా పరిశీలిస్తూ నింపాదిగా కూర్చొని ఉన్నాడు దశరథం.

రెండు పదులకుపైగా పోలీసు బలగం తోడుగా ఆరుగురు ప్రభుత్వ సేవకులు రేపటి ఎన్నికల నిర్వహణకు సర్వసన్నద్ధమై బయలుదేరారు.

పోలీసు సైన్యం పోరాట దక్షతతో డేగల్లా పరికిస్తూంటే. ఎన్నికల నిర్వహణాధికారులు ఊపిరే భారంగా బిగబట్టుకు కూర్చున్నారు.

తీవ్రవాదం పోలీసుకోటకు తూట్లు పొడుస్తూనే ఉంది. తమ పంథాకు అడ్డొస్తున్న 'ఖాకీ' సైన్యాన్ని మట్టు బెట్టే చర్యలు ఇటీవలి కాలంలో మరీ విజృంభించాయి.

పరిస్థితుల తీవ్రతను దృష్టిలో పెట్టుకొని గట్టి బందోబస్తుతో ఎన్నికల నిర్వహణకు రంగం సిద్ధం చేశారు.

✪ ✪ ✪

తమ డ్యూటీ అతి కీలకమైన ఆ మారుమూల ప్రాంతమని తెలిసిన మరుక్షణంలో దశరథం మొహంలో ఆనందాతిశయ రేఖలువ్యాపించాయి.

మిగతా వారి **విషయమెలా** ఉన్నా ఈ బడిపంతులు దశరథం **మాత్రం నూటొక్క** దేవుళ్ళకి దండం పెట్టుకున్నాడు.

ఏదో, మరేదో ఊహించి, ఆశించి కాదు, తన మృత్యువును కోరుకొని... కేవలం తన చావుని కోరుకొని!

అవును... ఈరోజు మొదలు, రేపు ఎన్నికలు ముగిసి, ఆ మర్నాడు ఇంటికి చేరే చివరి క్షణంలోగా తాను చనిపోవాలి!

మృత్యువును దేవతని ఎందుకన్నారో తెలీదు కానీ, ప్రస్తుతం ఆయనకు కావలసింది ఆ దేవత అనుగ్రహమే. దానికోసమే ఆశగా వేచి ఉన్నాడు. తాను కోరిన సుదినం రానే వచ్చింది.

తాను పయనిస్తుంది ముళ్ళబాటే... అదే తన

నింపాదిగా కూర్చొని పరిస్థితులను పరికిస్తున్నాడు.

బస్సు అలా జోగుతూ సాగుతూంటే తల వెనక్కి వాల్చి మెల్లగా కళ్ళు మూసాడు. ఆలోచనలు గతంలో కెళ్ళాయి...

✪ ✪ ✪



"చేతికొస్తాడనుకొన్న పెద్దాడు కాస్తా జులాయిగా మారాడు. చిన్నోడా... వాడు ఎలాగూ చిన్నోడే...! పెద్దది... దానికి చదువు వద్దు మొర్రో అని మొత్తుకొన్నా ఈ కాలం ఆడది ఆమాత్రం చదూకోకపోతే ఎలా అని డిగ్రీలు చదివించారు. ఇప్పుడు ఆదర్శాలూ... నా శ్రాద్ధాలు అంటూ మొగుణ్ణి వదిలేసి చంటోణ్ణి పట్టుకొని వచ్చి ఇంట్లో తిష్టవేసింది. దానికి తోడు ఈ రెండోది. దీని వేషాలకే కావాలి మన సగం సంపాదన. నెలకో డ్రస్సు, వారానికో చెప్పుల జోడీ... ఇహ అలంకరణలకు అదుపే లేదు. మూడోదా...! ఇప్పుడిప్పుడే ఎదుగుతున్న పిల్ల... వీళ్ళ గాలి సోకిందంటే, అదీ చేతికి రాదు... ఏమండీ...! నా మాటలేమైనా వినబడుతున్నాయా? లేక...."

"ఆపవే నీగోల... రోజూ ఉండే సోదేగా...! అయినా ఇవన్నీ నాకు తెలీని విషయాలా ఏంటి?"

బియ్యంలో రాళ్ళేరుతూ ఏకరువు పెడ్తున్న లక్ష్మికి ఠక్కున అడ్డు తగిలాడు దశరథం. చదువుతున్న పేపర్ని పక్కన పెట్టి....

"ఇలా మధనపడుతూ కూర్చుంటే తీరే సమస్యలా ఇవి. అయినా నేనేం తప్పు చేశానే...? చదువొంట బట్టని పెద్దోణ్ణి నా స్నేహితుని మెకానిక్ షెడ్డులో పనికి కుదిర్చానా...? వాడు 'నేను చేసేది కాయకష్టం కదా! మాలాంటి శ్రమ జీవులకు ఊరట కల్గించేవి ఇవే. అందుకే తాగుతున్నా' అని గర్వంగా చెప్పాడు. అంటే మన చేత్తో మన చెంపపైనే కొట్టాడు. ఇహ పెద్దది... ఏ ఆధారం లేకపోయినా తన కాళ్ళపైన తను నిలబడగలదన్న ఉద్దేశంతో అలా చదివించా. రెండో దానికంటావా? దానికి మాత్రం ఆ రంగుల ప్రపంచమే లోకమయింది.."

"... మూడు ముళ్ళు పడితే కానీ అది దార్లోకి రాదు" అవకాశాన్ని వదులుకోక అసలు విషయం జారేసింది లక్ష్మి.

" నా ఆలోచనా అదే గదే! కానీ... దానికి మొగుణ్ణి కొనే స్తోమత లేకే కాస్త వెనక్కి రావాల్సి వస్తోంది. మన సంపాదన పొట్టకు, ఇతర ఖర్చు[illegible] సరిపోవడం లేదు. ఈ అద్దెకొంప మినహా ఆస్తు[illegible] లేవు. నువ్వన్నట్లు చూస్తోంటే దానికి వయసు పై బడుతున్నట్లే ఉంది. కానీ మొన్నటి ఇందూరు సంబంధం లక్ష నుండి దిగలేదు కదా! అంత సొమ్ము మనకెక్కడిది? అలా అని చేతులు కట్టుకు కూర్చోలేదులే... ఆ ప్రయత్నాల్లోనే ఉన్నా. మరో వారం రోజుల్లో సర్దే ప్రయత్నాలు చేస్తున్నా. అందుకే అబ్బాయి తరపు వాళ్ళని కాస్త టైమడిగింది." భార్యను ఊరడింప చేస్తూ చల్లగా చెప్పాడు.

పక్కనున్న పేపరు అందుకొని ఆ వార్తను మరోసారి చదివాడు దశరథం. ఎన్నికల విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు ప్రాణనష్టం సంభవిస్తే ప్రభుత్వం నష్టపరిహారంగా లక్ష రూపాయలు అందజేస్తుంది.

అంతేగాక ఉద్యోగి రిటైరయ్యే సమయం వరకూ అతని కుటుంబానికి పూర్తి వేతనం అందుతుంది. అంటే వచ్చే నష్టపరిహారంతో రెండో కూతురి పెళ్ళి... మరో నాలుగేళ్ళ వరకూ వచ్చే వేతనంతో కుటుంబ పోషణ... తృప్తిగా ఫీలయ్యాడు దశరథం.

తను ఎలాగైనా ఈ మూడ్రోజుల కాలంలో చనిపోవాలి. కూతురు పెళ్ళి కోసం తన ప్రాణ త్యాగం. ఈ ఆలోచన అతనికే అబ్బురంగా, వింతగా అనిపించింది. కానీ మనం కోరినపుడు రావడానికి మృత్యువేం ఆటవస్తువు కాదుగా.

రేపు డ్యూటీ కెళ్ళాల్సి ఉండగా ఈ రోజుచెప్పారు. తనది ఈ మారుమూల మంగెనపల్లిలో డ్యూటీ అని. వెళ్ళే ముందు భార్యా పిల్లల్ని ఆర్తిగా పలకరించాడు.

లక్ష రూపాయల నష్టపరిహారంపై ఓ దిన పత్రికలో వచ్చిన కార్టూన్‌ను చూసి పిల్లలు నవ్వుకుంటున్నారు.

దశరథంకు కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఆ నవ్వులు కలకాలం తన ఇంట నిలవాలని కళ్ళు మూసుకొని ప్రార్థించాడు. కన్నీటి చుక్కలు రెండు కళ్ళనుండి రాలాయి.

✪ ✪ ✪

భారీ కుదుపుతో బస్సు ఆగడంతో దశరథం ఈ లోకంలోకొచ్చాడు.


"ఏమైంది?" అందరిలో టెన్షన్.

"టైర్ బరస్ట్ అయింది సర్" డ్రైవర్ సమాధానంతో అంతా చల్లబడ్డారు.

ఓ రెండు క్షణాలు నిశ్శబ్దం. మరుక్షణంలో తుపాకీ [illegible]ళ్ళ శబ్దాలు. బస్సు అద్దాలు పగిలిపోతున్నాయి [illegible]లు పొజిషన్‌లో కొచ్చారు.

"అందరూ పడుకోండి" ఓ పోలీసు అధికారి గట్టిగా అరిచాడు.

డ్రైవరు, ఇతరులు ఎక్కడి వాళ్ళక్కడే బోర్లా పడుకుండిపోయారు. సీమటపాకాయల్లా తుపాకుల శబ్దాలు వినిపిస్తోంటే అందరి గుండెలు అదిరి పోతున్నాయి.



## పులుల పెంపకం

టెక్సాస్‌లోని అస్టిన్‌కి చెందిన రాబర్ట్, జేన్‌లు పదకొండు సంవత్సరాల క్రితం పులులను పెంచటం మొదలుపెట్టారు. తమ ఇంటికి దగ్గరలో ఉన్న ముప్పై ఎకరాల భూమిని పులుల పెంపకానికి అనువుగా మార్చారు. ప్రస్తుతం రాబర్ట్, జేన్‌ల దగ్గర యాభై రకాల జంతువులు ఉన్నాయి. భయంకర జంతువులైన పులులను పెంచుతున్న రాబర్ట్, జేన్‌లు వీటి ఆహారానికి సంవత్సరానికి నలభై ఆరువేల డాలర్లు ఖర్చు చేస్తున్నారు.

-డి.వి.ఎల్.నరేంద్ర

---

ప్రాణాలపై ఆశ అందరిలోనూ అడుగంటి పోయింది. ఎవరికి వారే ఇష్టదైవాలను తల్చు కొంటున్నారు. బ్రతుకుపై ఆశ ఎక్కువయింది వారిలో, దశరథం మనసూ బ్రతుకువైపే మొగ్గు చూపుతోంది.

అంత వరకూ తన మదిలో మెదిలిన చావు ఆలోచనలు ఆమడ దూరం పోయాయి. ఈ ప్రమాదం నుండి బయటపడాలి. తాను రక్షింపబడాలి.

అప్పుడే ఓ బలమైన బూటుకాలు తనమెడపై పడింది. రెండు క్షణాలు.. అందులో ఒత్తిడి పెరిగింది. కదలలేని పరిస్థితి. శబ్దాలను బట్టి పోరు తీవ్రంగా ఉన్నట్టు తెలుస్తోంది.

ఆ కాలును నెట్టివేసేందుకు కూడా అవకాశం లేదు. దానికి తోడు మరో కాలు వీపుపై పడింది.

మరి రెండు క్షణాలు...

ఊపిరి అందడం మందగించింది.

నరాలు బిగబట్టేశాయి.

కనుగుడ్లు పైకి పొడుచుకొస్తున్నట్టనిపిస్తున్నాయ్.

శరీరం బరువుగా అనిపిస్తోంది.

క్షణాలు గడుస్తున్నాయ్...

చివరి దశలా తోస్తోంది.

శ్వాస ఆడటం లేదు... ఊపిరి ఆగిపోతోంది... అప్పుడే పైనున్న బూటుకాలు పోలీసు దబ్బున క్రింద పడిపోయాడు.

✪ ✪ ✪

దశరథం మామూలు మనిషి కావడానికి కొన్ని గంటలే పట్టింది. కోమాలోకి వెళ్ళిన తను కళ్ళుతెరిచే సరికి ఓ పూరి గుడిసెలో ఉన్నాడు.

"ప్రమాదమేమీ లేదు. ఈ రాత్రంతా రెస్ట్ తీసుకొంటే సరిపోతుంది" డాక్టర్ మాటలు లీలగా వినిపిస్తున్నాయి.

తన ఆలోచనలేమిటి... వింతగా సాగిపోతున్నాయి. నిజంగానే తాను చావాలనుకొన్నా, అదే పరిస్థితి ఎదురయ్యే సరికి బ్రతుకుపై ఆశ పుట్టుకొచ్చింది.

కళ్ళల్లో సన్నని నీటిపొర, కుటుంబ పరిస్థితిని భూతద్దంలోలా చూపిస్తోంది.

✪ ✪ ✪

"పెద్దక్కా! నీకేదో ఉత్తరమొచ్చింది చూడు."

తమ్ముడు ఇచ్చిన కవర్‌ను చించిన ఆమె మొహంలో వెయ్యి ఓల్టుల కాంతి తళుక్కుమంది.

"అమ్మా... అమ్మా..." అంటూ వంట గదిలోకి పరిగెత్తుకెళ్ళి.... "మొన్న జరిగిన డీఎస్సీ ఇంటర్వ్యూలో సెలెక్ట్ అయ్యానమ్మా. టీచర్ పోస్టులో జాయిన్ అవ్వమని ఉత్తరమొచ్చింది."

ఆమె మాటలకి తల్లి మొహంలో ఆనందం తాలూకు ఛాయలు తళుక్కున మెరిశాయి. వెంటనే వెళ్ళి దేవుని పటానికి దండం పెట్టుకుంది.

"ఇన్నాళ్ళకైనా మాపై దయకలిగింది. నీ మొక్కు ఈ వేసవి సెలవుల్లో తీర్చుకుంటామయ్యా!" భగవంతునికి హామీ కూడా ఇచ్చేసింది. ఈ ఆనంద సమయంలో పిండివంటలకు సిద్ధమైందావిడ.

అప్పుడే పెద్దవాడు పరుగున వచ్చాడు.

"అమ్మా... చిన్నక్క, వాళ్ళ క్లాస్‌మేట్ విశ్వనాథ్‌తో గుళ్ళో పెళ్ళి చేసుకుంటుంది. దాని ఫ్రెండొకావిడ ఇప్పుడే నాతో చెప్పింది." వగరుస్తూ చెప్పాడు.

నోట్లో బెల్లం ముక్క పెట్టి చెంపపై కొట్టినట్లు ... ఆవిడ అదిరిపడింది.

"ఐపోయింది... ఇన్నాళ్ళుగా కాపాడుకొస్తున్న పరువు గంగలో కలిసిపోయింది. దీనికేం పోయే కాలం వచ్చిందని ఈ పాపిష్టి పనికి పూనుకుంది....' కళ్ళు వర్షిస్తుండగా శాపనార్థాలు లంకించుకొంది.

పెద్దమ్మాయి సర్దిచెప్పే ప్రయత్నాలు ఫలించలేదు. సాయంకాలం ఇంటికొచ్చిన దంపతులకు హారతు లిచ్చి లోపలికి ఆహ్వానించింది.

"పైసా కట్నం ఇచ్చుకోలేని మనకు, చెల్లి ఈపని చేసి చాలా ఉపకారం చేసిందమ్మా" అన్న పెద్దకూతురి మాటలు మంత్రంలా పనిచేశాయి.

అందుకే ఆ అమ్మ సాయంకాలానికల్లా మంచిదైపోయింది. "రేపు మీనాన్న రాగానే ఈ విషయాన్ని నువ్వే సర్దిచెప్పాలి సుమా! లేకపోతే ఈ వాస్తవాన్ని ఆయన తట్టుకోలేరు" కండిషన్ పెట్టింది.

✪ ✪ ✪

తెల,తెలవారు తుండగా ఓ అంబులెన్స్ వచ్చి ఇంటి ముందాగింది. కళ్ళాపి చల్లుతున్న లక్ష్మి తలెత్తి చూసింది. ఇద్దరు వ్యక్తులు స్ట్రెచర్‌ను తెచ్చి ఇంటిముందు పెట్టారు.

"నిన్న పోలింగ్ సమయంలో ఎవరో దుండగులు బ్యాలెట్ బాక్సులు ఎత్తుకు పోవడానికి ప్రయత్నించారు అడ్డుపడ్డ మాస్టార్ని పొడిచి చంపారు. ఎంత ప్రయత్నించినా బ్రతికించుకోలేక పోయాం."

పరిస్థితులు కలిసొచ్చి, తమ కుటుంబ కష్టాలు కడతేరాయని కమ్మని కలలుకన్న ఆ కుటుంబ సభ్యులకు కన్నీళ్ళే తోడయ్యాయి.

ఆ కన్నీటి చారికల్ని ఏ లక్షలూ తుడవలేవు. ఆ గుండెలోని బాధల్ని ఏ ఓదార్పులూ చల్లార్చలేవు!✪